ప్రజాశక్తి
శనివారం 5 నవంబర్ 2022
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

'ఉక్కు'పై తీర్మానం చేయాల్సిందే..



ఉక్కు ప్రయివేటీకరణపై బిజెపి ఎమ్మెల్సీ మాధవ్‌ను ప్రశ్నిస్తున్న సిపిఎం, సిపిఐ కార్పొరేటర్లు డాక్టర్ బి.గంగారావు, స్టాలిన్

- జివిఎంసి కౌన్సిల్‌లో విపక్షాల పట్టు
- బిజెపి ఎమ్మెల్సీ మాధవ్‌ను చుట్టుముట్టిన కార్పొరేటర్లు
- స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణతో విశాఖకు తీవ్ర నష్టం : సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు
- తీవ్ర నిరసనలు, సభ్యుల సస్పెన్షన్ల మధ్య ముగిసిన సమావేశం
- చర్చ లేకుండానే 28 అంశాలు ఆమోదం, 2 వాయిదా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : **తీవ్ర నిరసనలు, సభ్యుల సస్పెన్షన్ల మధ్య జివిఎంసి కౌన్సిల్ సమావేశం శుక్రవారం సాగింది. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం తీర్మానం చేయాలన్న డిమాండ్‌తో మార్మోగింది.** ఈ నెల 11, 12 తేదీల్లో విశాఖ పర్యటనకు ప్రధాని మోడీ వస్తున్న నేపథ్యంలో విశాఖ ఉక్కు కర్మాగారం ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా మరోసారి తీర్మానం చేసి, ప్రధానిని కలిసి, ప్రజల మనోభావాలను తెలపాలంటూ పలువురు కార్పొరేటర్లు జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకట కుమారిని డిమాండ్ చేశారు. తొలుత స్టీల్‌ప్లాంట్ అంశంపై చర్చ జరిగింది. ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా మేయర్ పోడియం వద్ద సిపిఎం, సిపిఐ, టిడిపి, జనసేన కార్పొరేటర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం వ్యవహరిస్తున్న తీరు, ప్రయివేటీకరణ వల్ల విశాఖకు జరిగే నష్టాన్ని కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు వైసిపి కార్పొరేటర్లు మద్దతు తెలిపినప్పటికీ ఆ అంశంపై ఎటువంటి తీర్మానమూ చేయకుండానే సభ ముందుకు సాగింది. కనీస చర్చ జరగకుండానే కౌన్సిల్ సమావేశంలో 28 అంశాలను ఆమోదించారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ జరిగితే విశాఖ వల్లకాడు అవుతుంది

- డాక్టర్ బి.గంగారావు

సమావేశం ప్రారంభమైన వెంటనే సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా మాట్లాడారు. పరిశ్రమ గొప్పతనాన్ని వివరించారు. ఈ నెల 11, 12 తేదీల్లో విశాఖకు వస్తున్న ప్రధాని మోడీని మేయర్ ఆధ్వర్యంలో డిప్యూటీ మేయర్లు, ఫ్లోర్ లీడర్లు అంతా కలిసి స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని తెలియజేయాలన్నారు. ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పలు ఉద్యమాలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. స్టీల్‌ప్లాంట్‌కు తీవ్ర నష్టాలు వచ్చే విధంగా కేంద్రం కుట్రలు పన్నుతోందన్నారు. గత ఏడాది రూ.వెయ్యి కోట్ల లాభంలో ఉన్న ప్లాంట్‌కు ఈఏడాది నష్టాలు వచ్చేలా చేశారన్నారు. ఉత్పత్తి సామర్థ్యాన్ని తగ్గించేశారన్నారు. బ్లాస్ట్ ఫర్నేస్‌లను మూసివేసారని తెలిపారు. బొగ్గును ఒడిశా నుంచి రానీయకుండా అడ్డుకుంటున్నారన్నారు. దీంతో విదేశాల నుంచి బొగ్గును దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి తలెత్తుతోందన్నారు. దీని కారణంగా ఖర్చు పెరిగి ప్లాంట్‌పై భారం పడుతోందన్నారు. తద్వారా సుమారు రూ.2 వేల కోట్లు స్టీల్‌ప్లాంట్‌కు నష్టం వాటిల్లిందని అన్నారు. ఉక్కు కర్మాగారం ఉంది కాబట్టే విశాఖ ఇంతగా అభివృద్ధి చెందిందన్నారు. ప్లాంట్ ప్రయివేటుపరమైతే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడి ప్రజలంతా అంబానీలకు, అదానీలకు బానిసలుగా బతకాల్సి వస్తుందన్నారు. ఒక విధంగా చెప్పాలంటే స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ జరిగితే విశాఖ వల్లకాడుగా మారుతుందని అన్నారు.

మాధవ్‌ను చుట్టుముట్టిన కార్పొరేటర్లు

కౌన్సిల్‌లో బిజెపి ఎమ్మెల్సీ పివిఎన్.మాధవ్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ విషయంలో అవాస్తవాలు తగవన్నారు. గత ప్రభుత్వాల హయాం నుంచే ప్లాంట్ ప్రయివేటీకరణ అంశం ఉందన్నారు. తమ ప్రభుత్వం వికేంద్రీకరణను కోరుకుంటోందని అన్నారు. స్టీల్‌ప్లాంట్ విషయంలో మాధవ్ మాట్లాడుతున్న సమయంలో పలువురు కార్పొరేటర్లు అతని ప్రసంగాన్ని అడ్డుకున్నారు. వాస్తవాలు మాట్లాడాలని సిపిఎం కార్పొరేటర్ గంగారావు మిగతా 2లో..

ఐక్య పోరాటాలతో కార్మిక హక్కుల సాధన

వార్త 8లో..

ఉత్తరాంధ్ర సమస్యలను పరిష్కరించరూ..

వార్త 2లో..

సిఐడి అర్థం మారుతోంది..!

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సిఐడి అంటే క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ కాదని, సిఎం ఇంటరెస్టింగ్ డిపార్ట్‌మెంట్ అని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.నజీర్ ఆరోపించారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఐడి అత్యుత్సాహంగా పనిచేస్తూ ముఖ్యమంత్రికి తొత్తులా వ్యవహరిస్తోందని విమర్శించారు. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడును అర్ధరాత్రి వచ్చి అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నించారు. సిఐడి ఎంత నీచంగా వ్యవహరించినా.. చివరకు న్యాయమే గెలిచిందన్నారు. సమావేశంలో పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం మిగతా 2లో..

ఉపాధి ఒట్టిమాటే..!

◆ ఎన్ఎబిలో నిర్వాసితులకు మొండిచెయ్యి ◆ అవస్థల్లో నేవల్ బేస్ బాధితులు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

నేవల్ ఆల్టర్‌నేటివ్ ఆపరేషన్స్ బేస్ (ఎన్ఎఒబి) నిర్వాసిత కుటుంబాల్లో అర్హులైన అభ్యర్థులకు కంపెనీలు ఉద్యోగాలు ఇవ్వడంలేదు. పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకు కల్పిస్తామన్న ప్రభుత్వ జిఒ అమలుకావడంలేదు. నిర్వాసిత కుటుంబాలకు ఇవ్వాల్సిన ప్యాకేజీ మొదలుకొని, ఉపాధి వరకు లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలేవీ సరిగా కార్యరూపం దాల్చలేదు. దీంతో అనివార్యంగా ఇచ్చిన హామీల అమలుకోసం నిర్వాసితులు, ఎన్ఎఒబి ప్రభావిత ప్రజలు ఆందోళనకు దిగాల్సివస్తోంది. పుట్టు ప్యాకేజీ కింద లక్ష రూపాయలు ఇస్తామని చెప్పి రూ.50 వేలు ఇచ్చారని నిర్వాసితులు 'ప్రజాశక్తి'కి తెలిపారు. ఎన్ఎఒబిలో



నేవల్ బేస్ గేట్ వద్ద ఆందోళన చేపట్టిన నిర్వాసితులు

నిర్వాసితులైన వేల్పుగొండుపాలెం, దేవళ్లపాలెం, రేవువాతాడ, పిసినిగొట్టిపాలెం ప్రజలకు పునరావాసం కల్పించిన నేవీ కాలనీలో ఉపాధిలేక పడుతున్న అవస్థలు అన్నీఇన్నీకావు. మహిళలు బ్రాండిక్స్, ఇతర కంపెనీల్లో పనులకు వెళ్తుంటే, మగవాళ్లు గతంలో చేయని మట్టిపనులకు వెళ్తున్నారు. గంప మహిళలకు ఇస్తామన్న లక్ష రూపాయల ప్యాకేజీ పదిహేడేళ్లవుతున్నా చెల్లించలేదని మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

'ఉక్కు'పై తీర్మానం చేయాల్సిందే..

అన్నారు. మాధవ్‌ను విపక్షాల కార్పొరేటర్లు చుట్టుముట్టారు.

చర్చ ఇలా..

జీరో అవర్‌లో ప్రధానంగా సుమారు గంటసేపు కోడి చెత్త తరలింపు అంశంపై చర్చ జరిగింది. అధికారులు వివరణ ఇచ్చినప్పటికీ ప్రతిపక్ష టిడిపి కార్పొరేటర్లు సంతృప్తి చెందలేదు. ముఖ్యంగా నగర పరిధిలోని 1282 కోడి మాంసం విక్రయ కేంద్రాల నుంచి సేకరిస్తున్న చెత్తను నిర్ణీత ప్రదేశమైన కాపులుప్పాడకు కాకుండా అక్రమంగా రొయ్యల, చేపల చెరువులకు తరలించి తద్వారా ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్నారని పలువురు మండిపడ్డారు. కొందరు మాఫియాగా ఏర్పడి వైసిపి కార్పొరేటర్ల అండతో అక్రమంగా సంపాదిస్తున్నారని టిడిపి కార్పొరేటర్లు ఆరోపించారు. టెండర్లు పిలవకపోవడంపైనా వారు అధికారులను ప్రశ్నించారు. 56వ వార్డు టిడిపి కార్పొరేటర్ శరగడం రాజశేఖర్ మాట్లాడుతూ తమ వార్డుల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు, శంకుస్థాపనలకు తమకు సమాచారం ఇవ్వడం లేదన్నారు. దీనిపై వివరణ ఇచ్చిన జివిఎంసి కమిషనర్ పి.రాజబాబు ప్రోటోకాల్ ఉల్లంఘన ఫిర్యాదులు తమకు అందాయని, అటువంటివి పునరావృతం కాకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం 48వ వార్డు బిజెపి కార్పొరేటర్ గంకల కవిత మాట్లాడుతూ రెండేళ్లుగా తమ వార్డులో అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయని అన్నారు. పరుష పదజాలంతో దూషిస్తూ అధికారులపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రజల సొమ్ము తింటూ.. వారి అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తున్న అధికారులు పురుగులు పట్టిపోతారని ఆమె అన్నారు. ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, అధికారులకు క్షమాపణ చెప్పాలని మేయర్ కోరగా దానికి నిరాకరించిన కవితను కౌన్సిల్ సమావేశం నుంచి సస్పెండ్ చేశారు. అయినప్పటికీ ఆమె సభను వీడి వెళ్లకపోవడంతో మార్షల్స్ ఈడ్చుకుంటూ వెళ్లారు. అనంతరం సాధారణ అజెండాపై చర్చ ప్రారంభమైనప్పటికీ అన్ని అంశాలను సభలో చర్చించకుండానే మేయర్ ఆమోదించారు. అజెండాలోని అంశాలను చర్చించాలని సిపిఎం కార్పొరేటర్ గంగారావు కొంతసేపు మేయర్ పోడియం వద్ద కూర్చొని నిరసన తెలిపినప్పటికీ మేయర్ స్పందించలేదు. అనంతరం అజెండాలోని అంశాలు చర్చించాలని తెలుగుదేశం, జనసేన పార్టీల కార్పొరేటర్లు మేయర్ పోడియం వద్ద తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేయడంతో టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావుతోపాటు 56వ వార్డు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్‌లను మేయర్ సభ నుండి సస్పెండ్ చేసి సభను కొనసాగించారు. ఈ సందర్భంగా పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉపాధి ఒట్టిమాటే..!

నిర్వాసితులు వాపోయారు. నిర్వాసిత కుటుంబాల పిల్లలకు ప్రత్యేకంగా కేంద్రీయ విద్యాలయం నిర్మిస్తామన్న మాట నెరవేరలేదు. ఆసుపత్రి నిర్మాణ హామీ అమలుకునోచుకోలేదు. నిర్వాసితుల సమస్యలిలావుంటే ఎన్ఎఒబి ప్రభావిత గ్రామాల ప్రజలు మరో సమస్యతో బాధపడుతున్నారు. ప్రహరీ గోడ నిర్మాణం జరుగుతుండగానే చేపల వేటకు ఇబ్బంది లేకుండా జట్టీ నిర్మిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఎన్ఎఒబి నిర్వాసితులు, ప్రభావిత ప్రజల సమస్యలపై పోరాటాలు జరుగుతున్న ప్రతిసారీ హామీలు ఇవ్వడం, తరువాత నెరవేర్చకపోవడంతో ఉన్నకొద్దిపాటి పనులు కూడా మానుకొని ఆందోళనకు దిగాల్సివస్తోంది.

ప్రతిపక్షంలో వున్నప్పుడు నిర్వాసితుల పక్షాన మాట్లాడ్డం, అధికారంలోకి వచ్చాక వారిని నిర్లక్ష్యం చేయడం పరిపాటిగా మారిన ఫలితంగా సమస్యలు పరిష్కారంకావడంలేదు. చలో కలెక్టరేట్ ముట్టడి సందర్భంగా 2011 సెప్టెంబరు 28న కలెక్టర్ లవ్‌అగర్వాల్ ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలుకాలేదు. గంప మహిళలకు, 18 ఏళ్లుదాటిన యువకులు, వితంతువులు, వలస కూలీలు, ఇతర తరగతులకు ప్యాకేజీ వర్తింపజేస్తామని చెప్పినా సంపూర్ణంగా నెరవేరలేదు. 2018 ఆగస్టు 21న కలెక్టరేట్‌లో ఎన్ఎఒబి నిర్వాసిత, ప్రభావిత గ్రామ పెద్దలు, జాయింట్ కలెక్టర్ సృజన, యలమంచిలి ఎస్‌డిసి భాస్కరరెడ్డి, అనకాపల్లి ఆర్‌డిఒ ఎంవి.సూర్యకళ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.నర్సింగరావు, విశాఖపట్నం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఇతర అధికారుల సమక్షంలో జరిగిన సమావేశంలో లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలు అమలుకాకపోవడంతో మళ్లీ నిర్వాసిత, ప్రభావిత ప్రజలు ఆందోళనకు దిగారు. సముద్రతీరంలో డ్రెడ్జింగ్ పనులు చేయడంతో పడవలు పెట్టుకొనే అవకాశంలేని మత్స్యకారులను శారద, వరహా నదుల్లో పడవలు పెట్టుకొనేందుకు అనుమతించిన నేవీ అధికారులు, ఇప్పుడు సబ్‌గేట్లు మూసేయడంతో చేపల వేటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది.

సిఐడి అర్థం మారుతోంది..!

ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎంవి.ప్రణవ్ గోపాల్, బొట్ట పరదేశి యాదవ్ పాల్గొన్నారు.

6న రాపిడ్ చెస్ పోటీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6న జిల్లా రాపిడ్ అండ్ బిట్జ్ చెస్ పోటీలు డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజీలో జరగనున్నాయి. వీటిలో ప్రతిభ కనబరిచిన మొదటి ఇద్దరు క్రీడాకారులు డిసెంబర్ 10, 11 తేదీల్లో జరగబోయే రాష్ట్ర రాపిడ్ అండ్ బిట్జ్ చెస్ పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని అసోసియేషన్ సెక్రటరీ మణికంఠ తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు 7032840125 నెంబరులో వంశీని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

అనకాపల్లి జిల్లా ఎసిగా శాంతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం) : అనకాపల్లి జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్‌గా కె.శాంతిని నియమిస్తూ దేవాదాయ ధర్మాదాయ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. కృష్ణా జిల్లా నెమలిలోని వేణుగోపాల స్వామి ఆలయం సహాయ కమిషనర్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఎన్‌టిఆర్ జిల్లా ఎసిగా ఆమె ప్రస్తుతం పని చేస్తున్నారు.

ప్రధాని గారూ.. ఉత్తరాంధ్ర సమస్యలను పరిష్కరించరూ..

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక లేఖ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 11న విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధాని మోడీ ఉత్తరాంధ్ర సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కోరింది. ఈ మేరకు శుక్రవారం ప్రధానికి పంపిన లేఖను మీడియాకు విడుదల చేసింది. లేఖలోని అంశాలను వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, వైస్ ఛైర్మన్ పి.రామారావు, కోశాధికారి బిబి.గణేష్, ఉత్తరాంధ్ర రక్షణ వేదిక అధ్యక్షులు ఎస్ఎస్.శివశంకర్, ప్రధాన కార్యదర్శి ఎన్.నాగేశ్వరరావు వివరించారు. గతంలో 2016, 2019ల్లో ప్రధాని హోదాలో మోడీ విశాఖ నగరాన్ని సందర్శించిన విషయాన్ని గుర్తు చేశారు. నాటి నుంచీ ఈ ప్రాంత అభివృద్ధికి ఏమీ చేయలేదన్నారు. సరికదా 32 మంది యువకులతో సహా అనేక మంది తెలుగు ప్రజల త్యాగాలతో స్థాపించబడిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేయడానికి నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. ఆంధ్ర రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం 2014ను దాని నిజమైన స్ఫూర్తితో అమలు చేయడం లేదన్నారు. ఫలితంగా ఉత్తరాంధ్ర ప్రాంతం విభజన తర్వాత కూడా మరింత వెనుకబాటులోనికే నెట్టబడిందన్నారు. ఈ నేపథ్యంలో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సొంత గనులు కేటాయించాలన్నారు. ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలన్నారు. అన్ని ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ప్రస్తుత విశాఖపట్నం రైల్వే డివిజన్‌తో కూడిన విశాఖపట్నం ప్రధాన కార్యాలయంగా రైల్వే జోన్ పూర్తి స్థాయి పని కోసం తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. మెట్రో రైలు ప్రాజెక్ట్ పని వెంటనే మంజూరయ్యేలా చూడాలన్నారు. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 93, షెడ్యూల్ XIIIలో భాగంగా పెట్రోలియం, గిరిజన విశ్వవిద్యాలయాల నిర్మాణాలను పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. బాబూ జగ్జీవన్ రాం ఉత్తరాంధ్ర సుజల స్రవంతితో సహా ఈ ప్రాంత పెండింగ్‌లో ఉన్న అన్ని నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు.

'ఉక్కు'పై కొనసాగుతున్న జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఎన్నో పోరాటాలు, త్యాగాలు, 32 మంది ఆత్మ బలిదానంతో ప్రభుత్వ రంగంలో ఏర్పడ్డ వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయటం లేదని ఈ నెల 11న విశాఖ వస్తున్న ప్రధాని మోడీ ప్రకటించాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు శుక్రవారానికి 582వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఐఎఫ్‌టియు కార్యకర్తలు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు ఐదు దశాబ్దాల క్రితం స్థాపించిన స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన భూములను ఇచ్చిన నిర్వాసితులలో అనేకమందికి ఈనాటి వరకూ ఉద్యోగాలు లభించలేదన్నారు. వారందరికీ ఆర్ కార్డులు ఉన్నప్పటికీ ఉద్యోగాలు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా వారందరికీ ఉద్యోగాలు ఇవ్వాలన్నారు.

లేకుంటే మిగిలి ఉన్న భూములను నిర్వాసితులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.కొండయ్య, కె.మల్లయ్య, జి.లక్ష్మీనారాయణ, పి.ఆదినారాయణ, వై.అప్పారావు పాల్గొన్నారు.

'వన్ టౌన్‌లో కార్పొరేటర్ సాధిక్ దందా'

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వన్‌టౌన్‌లో 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ దందాకు అడ్డూ అదుపూ లేకుండా పోయిందని టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అబ్దుల్ రెహమాన్ ధ్వజమెత్తారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికార మదంతో అటు అధికారులను, ఇటు స్థానిక ప్రజలను సాధిక్ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. వన్ టౌన్ ప్రాంతంలో వైసిపి అరాచకాలు ఎక్కువయ్యాయన్నారు. సమావేశంలో అబ్దుల్ గఫూర్, మహ్మద్ ఇలియాస్ పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అపార్ట్‌మెంట్లు, కాలనీల్లోని పట్టభద్రులంతా ఓటును నమోదు చేసుకోవాలని వార్వా ప్రధాన కార్యదర్శి బిబి.గణేష్, నివాస్ ప్రధాన కార్యదర్శి పి.నారాయణమూర్తి ఒక సంయుక్త ప్రకటనలో శుక్రవారం విజ్ఞప్తి చేశారు. పట్టభద్రులు ప్రజాస్వామ్య వ్యవస్థలో ముఖ్యమైన పాత్ర పోషించాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పాత ఓటర్ లిస్టులు రద్దయిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ నెల 7వ తేదీలోగా ఓటు నమోదు చేసుకుంటేనే మార్చి 2023లో జరిగే ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం లభిస్తుందన్నారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సిబిఎం కాంపౌండ్ గురుస్థానం ది ప్లే స్కూల్ బ్రాంచ్‌లో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలను పాఠశాల డైరెక్టర్ ఎస్.ఖాన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలలో అందరూ చురుగ్గా పాల్గొన్నారు. పిల్లల తాతయ్యలు, నానమ్మలు, అమ్మమ్మలు వారి మనుమలు, మనవరాళ్లతో కలిసి సందడి చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నిషా, ప్రిన్సిపాల్ గౌసియా భేగం పాల్గొన్నారు.

మార్గశిర మాసోత్సవాలకు రాట

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పాత నగరం బురుజుపేటలో ప్రసిద్ధి చెందిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాల పనులు ప్రారంభించేందుకు ముహూర్తపురాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో దేవస్థానం పాలక మండలి అధ్యక్షురాలు కొల్లి సింహాచలం, ఇఒ కె.శిరీష, ధర్మకర్తల మండలి సభ్యులు అనురాధ, వెంకటరమణ, ధనలత, సతీష్, స్వర్ణ రూపవాణి, అశోక్ కుమార్, మారుతి ప్రసాద్, సుబ్రహ్మణ్యం, ఈఈ వెంకటరమణ, ఎఇఒ రాంబాబు పాల్గొన్నారు.



మహూర్తపు రాట వేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి తదితరులు

రాష్ట్రంలో అరాచక పాలన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలో వైసిపి అరాచక పాలన సాగిస్తోందని, ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణుకుమార్ రాజు అన్నారు. లాసన్స్ బే కాలనీలోగల పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అయ్యన్నపాత్రుడు అరెస్టులో సిఐడి పోలీసుల తీరు దారుణంగా ఉందన్నారు. తాళాలు పగలగొట్టి, గోడలు దూకి వెళ్లడమేంటని ప్రశ్నించారు. 'ఈ ఉత్సాహం మీ బాబాయి హత్య కేసు దర్యాప్తులో లేదేం' అని జగన్‌ను ఉద్దేశించి ప్రశ్నించారు. విశాఖలో ఇప్పటికే పాలనను భ్రష్టు పట్టించారని, భూ కబ్జాలు పెరిగిపోయాయని అన్నారు. ఎమ్మెల్సీ మాధవ్ మాట్లాడుతూ మునుగోడు ఎన్నికల నేపథ్యంలో కెసిఆర్ డ్రామా ఆడి ఫెయిలయ్యారన్నారు. కూరగాయలను కొన్నట్లు ఎమ్మెల్యేలను కొనాల్సిన అవసరం తమ పార్టీకి లేదన్నారు.

13 నుంచి విశాలాంధ్ర పుస్తక మహోత్సవం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాలాంధ్ర 21వ పుస్తక మహోత్సవం ఈ నెల 13 నుంచి టర్నర్ చౌల్ట్రీ ఆవరణలో ప్రారంభం కానుందని బుక్ హౌస్ మేనేజర్ పి.ఎ.రాజు తెలిపారు. పక్షం రోజులపాటు నిర్వహించే పుస్తక మహోత్సవం పోస్టర్‌ను శుక్రవారం జరిగిన కార్యక్రమంలో జివిఎంసి కమిషనర్ పి.రాజబాబు, ఎమ్మెల్సీ పివిఎన్.మాధవ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్పొరేటర్ ఎజె.స్టాలిన్, అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలు అందజేస్తున్న లాల్, రాజశేఖర్

ప్రజాశక్తి- గాజువాక : పర్యావరణ పరిరక్షణకు మొక్కలునాటి, వాటిని సంరక్షిద్దామని ఆగ్రో ఫారెస్ట్ అధికారులు లకుపతి లాల్ పిలుపునిచ్చారు. కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు గురువారం 76వ వార్డు నడుపూరు సంకటవిమోచన గణపతి ఆలయ ప్రాంగణంలో నాటేందుకు కొబ్బరి, జామ, సపోటా, మామిడి తదితర ప్రయోజనకర మొక్కలను ఇంటక్ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్, వైసిపి నేత మంత్రి శంకరనారాయణలతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లకుపతి లాల్ మాట్లాడుతూ, 75వేల మొక్కల పంపిణీ లక్ష్యమైతే, ఇప్పటివరకు 50వేలకుపైగా మొక్కలను అందించి,నాటామన్నారు. కార్యక్రమంలో కోఆపరేటివ్ డైరెక్టర్ జగదీష్, ఆంజనేయులు, మంత్రి నరసింహామూర్తి,, పివి నగేష్, మునగపాక బాబురావు, కె.సుధాకర్, కె.కనకారావు, ఎంఆెఎస్ మూర్తి, డి భాస్కర్, ఎండి కృష్ణ, పి సతీష్, కే వేణు, ఎస్ అప్పలరాజు, వరలక్ష్మి, ఆర్‌పి, పాత్రుడు, హరి, అప్పలరాజు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటర్ల నమోదు పరిశీలన



ఓటర్ల నమోదు ఫారాలను పరిశీలిస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 45వ వార్డు నరసింహనగర్ రైతు బజార్ దగ్గర నిర్వహిస్తున్న ఓటరు నమోదు శిబిరాన్నిఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త , నెడ్‌క్యాప్ చైర్మన్ శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో జివిఎంసి డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కంపా హనోక్, వార్డ్ ప్రెసిడెంట్ పైడి రమణ, కొరుపోలు నాయుడు, దుర్గ, భరత్, సన్నీ పాల్గొన్నారు.

గ్రామాల్లో భూసార పరీక్షలు



మట్టి నమూనాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : సాంకేతికత ఆధారంగా నేల స్వభావం, పోషకాల లభ్యతపై నూతన పద్ధతులతో కాన్పూర్ ఐఐటి ప్రతినిధులు భూసార పరీక్షలు జరిపారు. శుక్ర వారం భీమిలి వ్యవసాయ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి, భూపరిరక్షక్ అనే నూతన పరికరం ద్వారా కేవలం రెండు నిమిషాల్లో మట్టి నమూనాలు పరీక్షించారు.

భీమిలి మండలం సింగన బంద, చిప్పాడ, కాపులుప్పాడ, ఆనందపురం, పద్మనాభం మండలం రేవిడి, కొరాడ గ్రామాల్లో పర్యటించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి కె అప్పలస్వామి ఆధ్వర్యంలో కాన్పూర్ ఔట్‌రీచ్ సెంటర్ నోయిడా ఐఐటికి చెందిన ఆగ్రో నెక్స్ సర్వీసెస్ బృందానికి నేతృత్వం వహించిన ఇషాంత్‌రావు తదితరులు రైతుల సమక్షంలో భూసార పరీక్షలు చేశారు. రైతు భరోసా కేంద్రాల్లో పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అనకాపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త ఎ శిరీష, విశాఖ, అనకాపల్లి , భీమిలి ఎడిఎలు టి.శ్రీదేవి, జె.ప్రసాద్, బొడ్డేపల్లి విజయప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారులు బి శివకోమలి, నాయక్ పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తే సమస్యలు పరిష్కారం

మండల సభలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి
పలుసమస్యలపై ఏకరువు పెట్టిన సభ్యులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి-పద్మనాభం: ప్రజలు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ, అధికారులు చిత్తశుద్ధి, విశ్వాసంతో పనిచేస్తే ప్రజా సమస్యలు పరిష్కారమౌతాయని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన మండల సమావేశంలో పాల్గొన్నారు. ముందుగా గ్రామస్థాయిలో సమస్యలను ఎంపిటిసిలు, సర్పంచ్‌లను అడిగి తెలుసుకున్నారు.

మండలంలోని అయినాడ, బీతాలవలస, బుడ్డి వలస, అగ్రహారం, రెడ్డిపల్లి, పొట్నూరు, కోరాడ, కృష్ణాపురం పాండ్రంగి, వెంకటాపురం,. మద్ది, గంధవరం, కొవ్వాడ గ్రామాలలో విద్యుత్ సమస్యలు ఉన్నాయని ఆయా గ్రామాల ఎంపిటిసిలు, సర్పంచ్‌లు సభ దృష్టికి తెచ్చారు. కొన్ని గ్రామాల్లో తాగునీటి పథకాల పైపులైన్లు పాడయ్యాయని, వాటిస్థానే కొత్తపైపులైను వేయించి, నీటికష్టాలు తీర్చాలని కోరారు. జగనన్న ఇల్లు కాలనీలో బిల్లులు సక్రమంగా ఇవ్వడంలేదని తునివలస బంగారప్పుడు కోరాడు. రెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి స్థలం కేటాయించాలని జెడ్‌పిటిసి శంకర్ గిరిబాబు, వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని రేవిడి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ స్వప్నను కోరారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలో గ్రామపంచాయతీల ఖాతాలకు నిధులు జమైనా, విశాఖపట్నం జిల్లాకు మాత్రం రాలేదని అనంతవరం సర్పంచ్ ప్రతినిధి జి.ఎర్రబాబు కోరారు. తనకు ఎటువంటి సమాచారమివ్వలేదని ఎంపిడిఒ పి.రాధను జెడ్‌పిటిసి గిరిబాబు ప్రశ్నించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రాజేశ్వరి అధికారులు, మండల సభ్యులు పాల్గొన్నారు.

అగనంపూడి రెవెన్యూ పరిధిలోని పాఠశాలలను

విశాఖ జిల్లాలో విలీనం చేయాలి

డిఇఒకు అఖిలపక్ష నేతల వినతి

ప్రజాశక్తి- గాజువాక : అగనంపూడి రెవెన్యూ పరిధిలోని అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలోని జెడ్‌పి, ఎంపిపి పాఠశాలలను విశాఖ జిల్లాలో విలీనం చేయాలని అగనంపూడి అఖిలపక్షనేతలు కోరారు. ఈమేరకు అనకాపల్లి డిఇఒ బి.లింగేశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేశారు.మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ సందర్భంగా ఎడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ విశాఖ జిల్లా అగనంపూడి రెవెన్యూ పరిధిలో ఉన్న లేమర్తి, పినమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, దిబ్బపాలెం, పెద్దమడక, దొంకాడ, లేమర్తి, అట్టవానిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, జిల్లాపరంగా చూస్తే అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో ఉన్నాయని, దీని వల్ల పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడి, అనేక సమస్యలు ఉత్పన్నమౌతున్నాయన్నారు. అక్షయపాత్ర మధ్యాహ్న భోజనం ఈ పాఠశాలల్లోని విద్యార్థులకు అందడం లేదని, పినమడక ఉన్నతపాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకుని, ఈనెల 2న విద్యార్థులు లేని సమయంలో భవనం కూలి పెద్ద ప్రమాదమే తప్పిందన్నారు. ఐదేళ్ల క్రితం అదనపు తరగతి గదుల నిర్మాణానికి పనులు చేపట్టి వదిలేయడంతో, స్లీల్ పాడైందని, వాటిని పూర్తిగా తొలగించి కొత్తగా పునర్నిర్మాణం చేపట్టాలని కోరారు.

దీనిపై డిఇఒ లింగేశ్వరరెడ్డి స్పందిస్తూ, జిల్లాల పునర్విభజన తర్వాత ఆయా పాఠశాలలకు అనకాపల్లి పరిధిలోకి వచ్చాయన్నారు. పినమడక హైస్కూల్ అభివృద్ధికి నాడునేడు కింద రూ.86లక్షలు మంజూరయ్యాయని, త్వరలో పనులు జరుగుతాయన్నారు. పరవాడకు రెగ్యులర్ ఎంఇఒను నియమించినందున పాఠశాలలపై పర్యవేక్షణ సమస్య ఉండబోదన్నారు. మంత్రి అమర్‌పేరిట ఇచ్చిన లేఖను రాష్ట్ర విద్యాశాఖకు తగు చర్యలకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో వైసిపి నేతలు బొబ్బరి అర్జున, టిడిపి నేత అండబోయిన మంగరాజు, జనసేన నేత బుధిరెడ్డి అప్పారావు, తోకాడ రాము పాల్గొన్నారు.

శ్మశానవాటికను ఆక్రమిస్తే కఠినచర్యలు



బోర్డు ఏర్పాటు చేయించిన జెడ్‌సి కృష్ణ

ప్రజాశక్తి -కంచరపాలెం : శ్మశానవాటిక ఆక్రమిస్తే చర్యలు తప్పవని జివిఎంసి ఐదో జోన్ కమిషనర్ ఆర్‌జివి కృష్ణ హెచ్చరించారు శుక్రవారం 53వ వార్డు, డాక్టర్ జాకీర్ హుస్సేన్‌నగర్ వద్ద జివిఎంసి ముస్లిం శ్మశానవాటిక ప్రధాన ద్వారం వద్ద బోర్డు ఏర్పాటు చేసారు. శ్మశానవాటికపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సచివాలయ టౌన్ ప్లానింగ్ సిబ్బందికి ఆదేశించారు. కొంతమంది సంఘం పేరుతో శ్మశానవాటికను ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని ఇటీవలే జాకీర్ హుస్సేన్ నగర్ మస్జిద్ – ఈ –అల్ ఖదీర్ కమిటీ సభ్యులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో జెడ్‌సి స్పందించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఎవరైనా శ్మశాన వాటికను ఆక్రమించే ప్రయత్నం చేస్తే నేరుగా తనకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారిని శిల్పశ్రీ, చైన్‌మెన్లు శివ ప్రసాద్, సతీష్, అప్పారావు, సచివాలయం టౌన్ ప్లానింగ్ సిబ్బంది కె.శాంతి, పి.జ్ఞాన ప్రకాష్, కె. నాని కుమార్ పాల్గొన్నారు.

వంగ మొక్కలు నాటడంపై అవగాహన



రైతులకు వివరిస్తున్న హార్టికల్చర్ అధికారులు

ప్రజాశక్తి - భీమునిపట్నం: అంటుకట్టిన వంగ మొక్కలు నాటే విధానంపై జిల్లా ఉద్యానవన శాఖాధికారి కె.మన్మధ రావు, భీమిలి డివిజన్ హార్టికల్చర్ అధికారి స్వాతి ఆధ్వర్యంలో శుక్రవారం భీమిలి, ఆనందపురం మండలాల రైతులకు అవగాహన కల్పించారు. అంటు కట్టిన మొక్కలు పురుగులు, తెగుళ్లను తట్టుకునే శక్తి అధికంగా ఉంటుందని, అధిక దిగబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు పి సరోజ పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో అనర్థాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : మాదక ద్రవ్యాలు వినియోగం వల్ల కలిగే అనర్థాలపై శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిఐ వి రామకృష్ణ మాట్లాడుతూ, డ్రగ్స్, నాటుసారా, ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి సమాచారం తెలిస్తే టోల్ ఫ్రీ నంబర్ 14500కు తెలియజేయాలని, ఫిర్యాదుదారుని వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.ఎస్ఐ డి.పద్మావతి, సిబ్బంది కెవి రావు, ఎన్ మధు, వహీదా, దేవి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కారు ఢీకొని యాచకురాలు దుర్మరణం



మృతి చెందిన యాచకురాలు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం బ్రిడ్జి సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యాచకురాలు మృతి చెందింది. పోలీసులు కథనం ప్రకారం వేములవలస, ఆనందపురం వెల్లంకి, బోయపాలెం పరిసర ప్రాంతాల్లో కొన్నేళ్లుగా భిక్షాటనతో జీవనం సాగిస్తున్న యాచకురాలు, శుక్రవారం చర్చి వద్ద రోడ్డుదాటుతుండగా, తగరపువలస వైపు నుంచి విశాఖ వెళుతున్న కారు బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృత్యువాత పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. ఆనందపురం ఎస్ఐ శ్యామ్‌సుందర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు

బాలికలు క్రీడల్లో రాణించాలి



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న సిస్టర్ జానీస్

ప్రజాశక్తి -ములగాడ : బాలికలు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ అన్నారు. అంతర కళాశాలల క్రీడోత్సవాల సందర్భంగా మాట్లాడుతూ, క్రీడల్లో రాణించడం ద్వారా కీర్తిప్రతిష్టలతోపాటు బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. జిల్లా వత్తి విద్యా అధికారి ఎన్.బెన్నుస్వామి మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం ద్వారా యువతలో ఉల్లాసం, ఆరోగ్యంతోపాటు పోటీతత్వం, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయన్నారు. జూనియర్ కళాశాలల గేమ్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.రాంబాబు, సెయింట్ ఆన్స్ నార్తరన్ అసిస్టెంట్ ప్రొవిన్షియల్ సిస్టర్ సలీన, కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా మాట్లాడారు. సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి అధ్యక్షతన, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జానీస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 47కళాశాలల నుండి 750 మంది విద్యార్థినులు క్రీడల్లో పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, వాలీబాల్, టెన్నికాయిట్ క్రీడాంశాల్లో పోటీలను నిర్వహించారు.

అలరించిన సంగీత విభావరి



సంగీత విభావరిని ప్రారంభిస్తున్న తిరుమలరావు

ప్రజాశక్తి- సీతమ్మధార : ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం సాయంత్రం సుస్వర ఝరి ఆధ్వర్యంలో ఓ తారక నవ్వులే పేరుతో నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షులు సన్ మూర్తి, ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు ఎవిఆర్ రెడ్డి పాడిన నీ కొండకు నీవే రప్పించుకో, కేవీ సత్యనారాయణ పాడిన రాగమయి రావే, పి. శ్రీనివాస్, సావిత్రి పాడిన ఝుమ్మంది నాదం, రామారావు పాడిన మాణిక్యవీణా వంటి గీతాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. వీరితో పాటు గాయకులు భరద్వాజ్, రంగ నాదం, బాబ్జి, మీనా కుమారి, ఆంజనేయ రెడ్డి, అంజలి జాస్మిన్, గీత నాటి మేటి గీతాలు ఆలపించారు.కార్యక్రమంలో ఆధ్యాత్మిక గురు ఎస్.ఫణిస్వామి, కళా రంగ నిర్వాహకులు ఎంవిఆర్ నాగేశ్వరరావు, ఎ. వెంకట్ పాల్గొన్నారు.

పట్టభద్రులంతా ఓట్లు నమోదు చేసుకోవాలి

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ



గాజువాకలోని ప్రైవేటు స్కూల్‌లో మాట్లాడుతున్న రమాప్రభ

ప్రజాశక్తి -గాజువాక : ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికలకు పట్టభద్రులంతా తమ ఓటును నమోదు చేసుకోవాలని పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభ కోరారు. శుక్రవారం గాజువాకలోని భాష్యం స్కూలు, చైతన్య కళాశాలలతోపాటు తోకాడ, గాజువాకలోని పలు ప్రాంతాల్లో సందర్శించి, అర్హులైన పట్టభద్రులను కలిసి ముందుగా తమ ఓటు హక్కును ఈనెల 7లోగా నమోదు చేసుకోవాలని కోరారు. పిడిఎఫ్ అభ్యర్థిగా ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో పోటీ చేస్తున్న తనకు ప్రథమ ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. రమాప్రభతోపాటు ఐద్వా జిల్లా కార్యదర్శి వై సత్యవతి, నాయకులు సంతోషం, వార్వ నివాస నాయకులు కిరీటం, త్రినాథ స్వామి, భాష్యం స్కూల్ ప్రిన్సిపల్ భారతి, సిఐటియు నాయకులు ఎం.రాంబాబు, కె శ్రీనివాసు పాల్గొన్నారు..

చిన్నారి వైద్యానికి జైలు సిబ్బంది వితరణ



సాయం అందజేస్తున్న జైలు సూపరింటెండెంట్ రాహుల్

ప్రజాశక్తి - ఆరిలోవ : అరుదైన హృద్రోగంతో బాధపడుతున్న విశాఖ కేంద్రకారాగారంలో వార్డరు లక్ష్మణరావు కుమారుడు ఆదిత్యరామ్‌కు అవసరమైన చికిత్స కోసం తమ వంతు సాయంగా జైళ్ల శాఖ సిబ్బంది గార్డింగ్ ఫోర్స్ యూనియన్ తరపున రూ 1.89 లక్షల ఆర్థికసాయం అందించారు. శుక్రవారం విశాఖ కేంద్రకారాగారం పర్యవేక్షణాధికారి ఎస్.రాహుల్ చేతుల మీదుగా బాధితుడు తండ్రి లక్ష్మణరావుకు అందజేసారు.కార్యక్రమంలో యూనియన్ సెక్రటరీ సతీష్, ట్రెజరర్ సూరాడ రాజు పాల్గొన్నారు.

అనిట్స్‌లో అంతర్జాతీయ సాంకేతిక సదస్సు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సత్యప్రసాద్, తదితరులు

ప్రజాశక్తి -తగరపువలస : సంగివలస అనిల్ నీరుకొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్(అనిట్స్) ఇసిఇ విభాగం ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ సిస్టమ్స్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీస్‌లో పురోగతి అనే అంశంపై రెండ్రోజుల అంతర్జాతీయ సాంకేతిక సదస్సు శుక్ర వారం ప్రారంభమైంది. బిఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారి ఎం.సత్యప్రసాద్ జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, మారుమూల ప్రాంతాలకు బిఎస్ఎన్ఎల్ డిజిటల్ సేవలను విస్తరించినట్లు తెలిపారు. . బిఎస్ఎన్ఎల్‌లో వాడే నూతన టెక్నాలజీని విద్యార్థులకు అందుబాటులో ఉంచి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కళాశాల ప్రధాన ఆచార్యులు కాల్వ శ్రీరామకష్ణ అధ్యక్షతన జరిగిన సదస్సులో డాక్టర్ రాజ్యలక్ష్మి, ఇసిఇ విభాగాపతి బండి జగదీష్ పాల్గొన్నారు. సదస్సు ప్రాధాన్యతను తెలిపే బ్రోచర్‌ను ఆవిష్కరించారు

కల్యాణ్‌కుమార్ లేనిలోటు తీర్చలేనిది



నివాళులర్పిస్తున్న కుటుంబసభ్యులు, పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి -మాధవధార : సంఘ సేవకులు, 50వ వార్డు బిజెపి నాయకులు చౌదరి కళ్యాణ్ కుమార్ సంస్కరణ సభ శుక్రవారం పూర్వ విద్యార్థులు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. మాధవధార ఆర్ఆర్ లిమిటెడ్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం చైర్మన్ సనపల బంగారురాజు మాట్లాడుతూ చౌదరి కల్యాణ్‌కుమార్ అకాలమరణం బాధాకరమని, ఆయనలేని లోటు ఎవరూ భర్తీ చేయలేరన్నారు. ఈ సందర్భంగా కల్యాణ్‌కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.కార్యక్రమంలో చౌదరి అప్పారావు, మాధవధార మాధవస్వామి దేవాలయం అర్చకులు సనపల శ్రీనివాసం, తెలుగుదేశం పార్టీ 50వ వార్డు అధ్యక్షులు సనపల వరప్రసాద్, బిజెపి నాయకులు కెవి.రమణ, మూల రాము, సనపల మాధవరావు, రామకష్ణ, కెవిఆర్ మూర్తి, పప్పల గౌరీ శంకర్రావు, భగవతి చంటి, పప్పల గోపాల్ పాల్గొన్నారు.

సింహగిరి రక్షణ గోడ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న శారదా పీఠాధిపతి

ప్రజాశక్తి - ఆరిలోవ : సింహాచలం కొండపరిధిలో చినగదిలి నుంచి జ్ఞానానంద ఆశ్రమం వరకు రూ.5 కోట్ల ఎంపీ నిధులతో రక్షణ గోడ నిర్మాణానికి శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి శుక్రవారం శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా స్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ, సింహాచలేసుని భూములతో పాటు పర్యావరణ పరిరక్షణకు ఎంతో ఉపయోగకరంగా ఉండే రక్షణగోడ నిర్మాణానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఆక్రమణలకు గురవుతున్న దేవస్థానం భూములను, దేవాలయ ప్రతిష్టను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సింహాచలం పుణ్యక్షేత్రాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి రావాలని కోరారు. పంచగ్రామాల భూసమస్య ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లానన్నారు.

ఎంపి విజయసాయిరెడ్డి, టిటిడి చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ దేవస్థాన భూముల పరిరక్షణకు ఎంపి నిధులతో పాటు మరిన్ని నిధులు సేకరించి కొండచుట్టూ రక్షణ గోడ నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మంత్రి అమరనాథ్, ఎంపి సత్యవతి, విఎంఆర్‌డిఎ చైర్మన్ అక్కరమాని విజయనిర్మల, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ధర్మశ్రీ, ఆదీప్‌రాజు, టి.నాగిరెడ్డి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్, కలెక్టర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రీడా పోటీలకు 11 మంది ఎంపిక

ప్రజాశక్తి -ఆనందపురం: జిల్లాస్థాయి క్రీడా పోటీలకు 11 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి. శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల మండల స్థాయి, నియోజవర్గ స్థాయి ఆటల పోటీలలో బాలికల విభాగంలో100 మీటర్ల పరుగుపందెంలో బి శైలజ, వాలీబాల్ సీనియర్ బాలురు విభాగంలో బి.ప్రకాష్, షటిల్ బ్యాడ్మింటన్ జూనియర్ భాగంలో ఎం. ఉపేంద్ర ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాపోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరిని హెచ్‌ఎం శ్రీనివాసరావు, పిఇటి మాలతి,విద్యాకమిటీ చైర్మన్ చందక అప్పలనాయుడు తదితరులు అభినందించారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో హెచ్‌ఎం, తదితరులు

కొండవాలు ప్రాంత సమస్యలపై వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ హేమలత

ప్రజాశక్తి -మధురవాడ : ఐదోవార్డు పరిధిలోని కొండవాలు ప్రాంతాల్లో ప్రజల కష్టాలు తీర్చాలని జివిఎంసి ప్రధాన కమిషనర్ రాజాబాబుకు వినతిపత్రం ఇచ్చినట్లు కార్పొరేటర్ మొల్లి హేమలత తెలిపారు. వార్డు పరిధిలోని ప్రజాసమస్యలు, మౌలిక వసతుల కల్పనపై గతంలోనూ వినతిపత్రం ఇచ్చినప్పటికీ ఎటువంటి చర్యలు చేపట్టలేదని కమిషనర్‌కు విన్నవించారు. అయ్యప్పనగర్‌లోని తాగునీటి పథకం నిర్మాణంలో ఏళ్లతరబడి జాప్యం జరుగుతూ, నేటికీ పూర్తికాని పరిస్థితుల్లో వివేకానంద కాలనీ, వికలాంగుల కాలనీ, ముత్యాలమ్మ కాలనీ, తదితర కొండవాలు ప్రాంతాలలోని ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. సాయిరాం కాలనీ, శారదనగర్ తదితర కొండవాలు ప్రాంతాల్లోనూ తాగునీటి ఎద్దడి నెలకొందని విన్నవించారు. నగరంపాలెం వుడా మాస్టర్ ప్లాన్ రోడ్‌ను మధ్యలో ఆపేయడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని దాన్ని వెంటనే పూర్తి చేయాలని కోరారు. జివిఎంసి నిధులతో మంజూరైన అనేక పనులకు శంకుస్థాపన చేసినా, నేటికీ ప్రారంభదశను దాటలేదని విన్నవించారు. సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. టిడిపి సీనియర్ నేత మొల్లి లక్ష్మణరావు ఉన్నారు.

అయ్యన్నను కలిసిన జనసేన నేతలు

ప్రజాశక్తి - మధురవాడ : ఫోర్జరీ ఆరోపణలతో సిఐడి పోలీసులు పెట్టిన కేసు నుంచి బయటపడిన మాజీ మంత్రి, టిడిపి సీనియర్ నేత అయ్యన్నపాత్రుడును నర్సీపట్నంలోని ఆయన నివాసంలో భీమిలి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జనసేన నేతలు మాట్లాడుతూ, వైసిపి అరాచకలు, అక్రమాలు, దౌర్జన్యం ఇంకా ఎంతో కాలం సాగవని, జగన్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్నారు.



అయ్యన్నను కలిసిన భీమిలి నేతలు

కలగా మిగిలిన రైతుబజారు ఏర్పాటు

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం కూడలి సమీపంలో రైతు బజార్ ఏర్పాటు కలగానే మిగిలిపోయిందని వైసిపి మండల ప్రధాన కార్యదర్శి కోన శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై మండల ప్రజలు భీమిలిఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇదే విషయాన్ని మండలసభలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, దరఖాస్తు ఇచ్చి వెళ్లండంటూ చెప్పారని, దీంతో అధికార పార్టీ నాయకులు ఆయనతో వాగ్వాదం చేయకుండా ఉండిపోయారన్నారు. ఆనందపురం పూల మార్కెట్‌కు రాష్ట్రంలోనే మంచి పేరు ఉందని,అయితే ఇక్కడే ఉన్న కూరగాయలు, నిత్యావసరాల మార్కెట్‌లో ధరల దారుణంగా ఉంటాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పరంగా రైతుబజారు ఏర్పాటు చేస్తే ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగాఉంటుందని ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా ఎవరికీ పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

శారదాపీఠాన్ని వైసిపి నేతల సందర్శన

ప్రజాశక్తి- పెందుర్తి : విశాఖ శారదాపీఠాన్ని రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, వైసిపిరీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి గురువారం సందర్శించారు. శారదా పీఠాధిపతి స్వరూపనందేంద్ర సరస్వతిని ఆశీస్సులు పొందారు. రాజశ్యామల అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ కార్తీక ఏకాదశి పురస్కరించుకొని దేవాలయాలను సందర్శించినట్లు తెలిపారు. దేవాలయాల అభివృద్ధికి స్వామీజీ సూచనల మేరకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే అదీప్ రాజ్, వైసిపి నేత శరగడం చిన అప్పలనాయుడు, 96వ వార్డు వైసిపి అధ్యక్షులు దాడి మహేశ్వరరావు, దేముడు, మెంటి మహేష్ పాల్గొన్నారు

అప్పన్న సన్నిధిలో టిటిడి చైర్మన్ సుబ్బారెడ్డి

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్నను టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి శుక్రవారం సతీసమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఇఒ త్రినాథరావు సాదరంగా స్వాగతించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించగా, ఇఒ దుశ్శాలువాతో సత్కరించి, స్వామి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని. అందించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సింహాచల దేవస్థానానికి త్వరలోనే పూర్తిస్థాయి ఇఒ వస్తారన్నారు. సింహాచల దేవస్థానానికి అవసరమైన సహాయ సహకారాలు టిటిడి నుంచి అందిస్తామన్నారు. దేవస్థానం ఉద్యోగులకు 62 ఏళ్ల సర్వీస్ విషయమై సిఎం దృష్టికి తీసుకెళతామన్నారు.

వంటగ్యాస్ కనెక్షన్లు పంపిణీ



లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్ అందజేస్తున్న ఎంపిపి

ప్రజాశక్తి -తగరపువలస : పిఎంఎవై పథకం కింద భీమిలి మండలం దాకమర్రిలో 12 మంది లబ్ధిదారులకు వంటగ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. శుక్రవారం వీటిని ఎంపిపి దంతులూరి వెంకట శివ సూర్యనారాయణరాజు (వాసురాజు) , సర్పంచ్ చెల్లూరి పైడప్పుడు, ఎంపిటిసి నగేష్‌బాబు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణతో వ్యాధులు దూరం

ప్రజాశక్తి- సీతమ్మధార : ఇళ్లలోపల, పరిసరాల్లో దోమలు, వాటి లార్వాలకు ఆవాసంగా నీటి నిల్వ లేకుండా చర్యలు చేపడితే వ్యాధులు దరిచేరవని జివిఎంసి అదనపు కమిషనర్ వర్మ సూచించారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా 26వ వార్డు టిడిపి కార్పొరేటర్ ముక్క శ్రావణి ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ర్యాలీగా నిర్వహించారు. కార్యక్రమంలో మూడో జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, ఇఇ శ్రీనివాసరావు, ఎంహెచ్‌ఒ అనిల్‌కుమార్, వార్డు టిడిపి అధ్యక్షుడు ముక్క కిశోర్‌కుమార్, జివిఎంసి శానిటేషన్ సిబ్బంది, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల అభివృద్ధికి కృషి

జిల్లా విద్యాశాఖాధికారి లింగేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-అనకాపల్లి

విద్యార్థుల అభ్యసన సామార్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి బి.లింగేశ్వర రెడ్డి ఆదేశించారు. స్థానిక జీవీఎంసీ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మౌలిక వస్తువుల సమాచారాన్ని నింపే యుడైస్‌లో వచ్చిన వ్యత్యాసాలు, తాగునీరు విద్యుత్ సదుపాయం, టాయిలెట్లు ఉన్న పాఠశాలల సమాచారం, భవనాలు లేని పాఠశాలల విద్యార్థుల ఎన్రోల్మెంటు, విద్యార్థుల ఫేసియల్ అటెండెన్స్, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, పిల్లల అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించే బైజూస్ యాప్ వినియోగం వంటి అంశాలపై చర్చించారు. నాడు -నేడుకు సంబంధించి తల్లిదండ్రుల ఖాతాలో పడిన రివాల్వింగ్ ఫండ్ ఖర్చులు, ప్రాజెక్టు వారీగా పనుల పురోగతి సాధించాలని సూచించారు. విద్యారంగంలో జిల్లాను ప్రగతి పథంలో నడిపించేందుకు మండల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు, సీఆర్పీలు, ఎంఐఎస్ తదితర సిబ్బంది కృషి చేయాలని సూచించారు.



మాట్లాడుతున్న డిఇఒ లింగేశ్వరరెడ్డి



విజేతలతో బహుమతులు అందజేసిన నిర్వాహకులు

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి - పరవాడ

విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా ఉక్కు నగరం పవర్ గ్రిడ్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను పవర్ గ్రిడ్ మేనేజర్ జి.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. కలాశాలలో, 11, 12 తరగతులు చదువుతున్న 55 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ప్రథమ బహుమతి పి.హర్షిత, ద్వితీయ బహుమతి ఎన్.ప్రవీణ, తృతీయ బహుమతి డి.నవీన్, నాలుగో బహుమతి ఎ.దివ్య సాధించారు. జి.ప్రియ, పి.భూమిక, ఎస్.స్వేత ప్రోత్సాహక బహుమతులు గెలుచుకున్నారు. వారోత్సవాలు సందర్భంగా కళాశాల విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ లెక్చరర్ లలితా కుమారి, పవర్ గ్రిడ్ విద్యుత్ సంస్థ ఉద్యోగులు గౌరీశంకరావు , దేవి వర ప్రసాద, పైల అప్పారావు, ఉమా శంకర్, మహేష్, అప్రెంటీస్‌లు ప్రియాంక, అపూర్వ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గ్రామసభలో పాల్గొన్న అధికారులు, రైతులు

ఈ-క్రాప్‌పై గ్రామసభ

ప్రజాశక్తి-కశింకోట

మండలంలోని తాళ్ళపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఈ-క్రాప్ నమోదు సోషల్ ఆడిట్‌పై శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ రైతు భరోసా కేంద్రం ఇన్‌ఛార్జి సన్యాసినాయుడు మాట్లాడుతూ ఈ-పంట సోషల్ ఆడిట్ లిస్ట్ ప్రదర్శన, పిఎం కిసాన్, ఇకేవైసీ, ఎన్‌పిసిఐ లింక్ గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటలక్ష్మి, సర్పంచ్ రెల్లి నాగయ్యమ్మ, ఎంపీటీసీ లగిశెట్టి భవాని, వైసిపి నాయకులు లగిశెట్టి గణేష్, వార్డు మెంబర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

18 రెవెన్యూ గ్రామాల్లో భూముల రీ సర్వే

ప్రజాశక్తి - దేవరాపల్లి

మండలంలోని 18 రెవెన్యూ గ్రామాలలో జగనన్న శాశ్వత భూ హక్కు సర్వే ప్రారంభం కానుందని తహశీల్దార్ ఎం.లక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని నాగయ్యపేట, మామిడిపల్లి, కాశీపురం, సీతంపేట, రైవాడ, తిమిరాం, చినగంగవరం, కొత్తపెంట, గరిశింగి, ములకలపల్లి, పెదనందిపల్లి, చిననందిపల్లి, బోయిలకింతాడ, ఎం. అలమండ, కొత్తపల్లి, కలిగొట్ల, తారువ, వేచలం తదితర గ్రామాలలో ఈ ప్రక్షాళన సర్వే త్వరలోనే ప్రారంభం కానుందని వెల్లడించారు. ఇందుకోసం భూ యాజమానులు తమ దగ్గర ఉన్న పట్టాదార్ పాస్ పుస్తకాలు, భూమి కొనుగోలు చేసిన పత్రాలు ఆయా గ్రామాల వీఆర్వోలకు జెరాక్స్ కాపీలు అందజేసి ఈ సర్వేకు భూ యాజమాన్యాలు సహకరించాలని ఆమె కోరారు.

జాతీయ చిత్ర కళా ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి- చోడవరం

స్థానిక ప్రేమ సమాజంలో శుక్రవారం ప్రారంభమైన జాతీయ చిత్రకళ ప్రదర్శనను అనకాపల్లి జిల్లా కలెక్టర్ పఠాన్‌శెట్టి సందర్శించారు. దేశంలోని 20 రాష్ట్రాల నుండి వచ్చిన చిత్రాలను ఆయన తిలకించారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో ప్రదర్శించిన చిత్రాలకు బహుమతులు ఇవ్వనున్నారు. చిత్రకళా నిలయం నిర్వాహకులు, విశ్రాంతి చిత్రలేఖన ఉపాధ్యాయులు బి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శన ఈ నెల 4, 5, 6 తేదీల్లో జరగనుంది. ఆ రోజుల్లో ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు చిత్రాలను అందరూ తిలకించవచ్చని ఈ సందర్భంగా సూర్యనారాయణ తెలిపారు. అనంతరం ప్రేమ సమాజంలోని పిల్లలకు స్థానిక న్యాయవాది డేవిడ్ సమకూర్చిన పండ్లు, పుస్తకాలు, పెన్నులను కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్డి శ్యామసుందర్, యుపిఆర్‌డి చైతన్య, చోడవరం పంచాయతీ ఈవో నారాయణరావు, ప్రేమ సమాజం నిర్వాహకులు రాజు, ఫోరం ఫర్ బెటర్ సభ్యులు డిఎస్ ప్రసాద్, రిటైర్డ్ లెక్చరర్ ఎన్.దేముడు, తిరుపతిరావు, విశ్రాంతి ఉపాధ్యాయులు వేణు, టీవీ రమణ, ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

'అమృత్ ఫల్'కు వైఎస్ఆర్ లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డు

ప్రజాశక్తి -అనకాపల్లి

రాష్ట్ర అవతరణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వైఎస్ఆర్ లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డును అమృత్ ఫల్ రైతు ఉత్పత్తిదారుల సొసైటీ దక్కించుకుంది. ఈ అవార్డును ముఖ్యమంత్రి చేతుల మీదుగా సొసైటీ సీఈవో కేఎల్ఎన్ మౌక్తిక అందుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు శుక్రవారం కలెక్టర్ రవి పఠాన్ శెట్టి, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, డిఆర్ఓ వెంకటరమణ, జిల్లా ఉద్యానవన అధికారి ప్రభాకర్ రావును కలిసి అవార్డు చూపించారు. జిల్లాకు మంచి పేరు తెచ్చిన అమృత్ పల్ సొసైటీ వారిని కలెక్టర్, జెసి, డిఆర్ఓ ఉద్యానవన శాఖ అధికారి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూరగాయలు పండించడం, కోల్డ్ స్టోరేజీ, మార్కెటింగ్ చేయడంలో అమత్ పల్ సొసైటీ కృషికి తగ్గ ఫలితం దక్కిందన్నారు.



కలెక్టర్, జెసిని కలిసిన అమృత్ పల్ సొసైటీ ప్రతినిధులు



శారదానది మెట్లు మార్గంలో తుప్పలు తొలగిస్తున్న సిబ్బంది

తుప్పల తొలగింపు

ప్రజాశక్తి- దేవరాపల్లి

మండల కేంద్రంలోని రాజులవీధి సమీపంలో శారదానది వెళ్లే మెట్ల రేవు మార్గంలోని తుప్పలు, డొంకలను పంచాయతీ పారిశుధ్య కార్మికులు శుక్రవారం తొలగించారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి ఆదేశాల మేరకు ఈ పనులు చేపట్టినట్లు గ్రామ సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ తెలిపారు. కార్తీక మాసంలో దీపారాధన చేసే భక్తులు నదీ తీర ప్రాంతానికి వెళ్లేందుకు ఈ మార్గాన్ని శుభ్రం చేసినట్లు ఆమె చెప్పారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

మండలంలోని సీతయ్యపేట రామాలయం వద్ద అనకాపల్లి సత్యదేవా హాస్పటల్ సహకారంతో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ వజ్రపు ఇందిరా శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సమీప గ్రామాలకు చెందిన 200 మంది రోగులకు వైద్యులు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ శిబిరంలో డాక్టర్ బొడ్డేడ లక్ష్మీ నరసింహారావు, ఎండీ సీఈవో డాక్టర్ గీతాంజలి చదరం, డాక్టర్ రామలక్ష్మి అక్కిరెడ్డి, డాక్టర్ ఎస్ఎస్ దివ్య, సురేంద్ర వీరాల, నూకేష్ దుంగ, రెహమాన్ షేక్, అరవింద్ దాడి, లావణ్య చావల, ప్రమీల, నాగలక్ష్మి, సమీరా, కావేరి, స్థానిక నాయకులు ప్రగడ చిన్నం నాయుడు, బొబ్బిలి శ్రీను, దకవరపు అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



వైద్య సేవలు అందిస్తున్న సత్యదేవ ఆసుపత్రి సిబ్బంది

రైలు ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - యలమంచిలి

జాతీయ రహదారి నుంచి యలమంచిలి పట్టణంలోకి వచ్చే రైలు ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను మున్సిపల్ ఛైర్ పర్సన్ పిళ్లా రమాకుమారి శుక్రవారం పున:ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ జాతీయ రహదారి నుంచి పట్టణంలోకి వచ్చే మార్గంలో ఉన్న రైలు గేటు యలమంచిలి మున్సిపాలిటీపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. ఎమ్మెల్యే రమణమూర్తిరాజు కృషితో రూ.8.10కోట్లతో బ్రిడ్జి నిర్మాణ పనులను పున:ప్రారంభించినట్లు చెప్పారు. 2009 ఫిబ్రవరి 15న నాటి మంత్రి కొణతాల రామకృష్ణతో రూ.35 కోట్లతో ఈ బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. కాంట్రాక్టర్ల మధ్య ఏర్పడ్డ అభిప్రాయభేదాల మూలంగా బ్రిడ్జి పనులు కుంటుబడ్డాయని పేర్కొన్నారు. బ్రిడ్జి పనులు పూర్తికాకపోవడం వల్ల ఎక్స్‌ప్రెస్ బస్సులు యలమంచిలి పట్టణంలోకి రావడం లేదని, దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఆరేడు నెలల్లో పనులు పూర్తి చేసి యలంమంచిలి పట్టణానికి రైలుగేటు సమస్య లేకుండా ప్రయాణాలు సాగనున్నాయని పేర్కొన్నారు. ఎంపిపి బోదెపు గోవిందరావు మాట్లాడుతూ తమది చేతల ప్రభుత్వంగా నిరూపించుకోవడానికి ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షులు బొద్దపు ఎర్రయ్య దొర, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, చిత్రంలో ఎంపిపి గోవిందరావు తదితరులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

ప్రజాశక్తి- దేవరాపల్లి

పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను వైసిపి ప్రభుత్వం అందిస్తుందని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని వాకపల్లి సచివాలయం పరిధి వెంకటరాజపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు విన్నారు. ఈ సందర్భంగా ఆధునికీకరణ చేసిన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించారు. నాడు-నేడు పథకం కింద రూ.16 లక్షలతో అంగన్వాడీ భవనం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ గ్రామానికి ఇప్పటికే అనేక అభివృద్ధి పనుల నిమిత్తం సుమారు రూ.60 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. జల్ జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు రూ.73 లక్షలు, ఇతర అభివృద్ధి పనులకు మరో రూ.8 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.కోటపాడు, దేవరాపల్లి జెడ్పిటిసిలు ఈర్లె అనురాధ, కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వైస్ ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి వెంకట రమణ, వెంకటరాజపురం గ్రామ సర్పంచ్ దాసరి సంతోష్ కుమార్ వైసిపి నాయకులు పాల్గొన్నారు.


వృద్ధురాలితో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు


సంపద కేంద్రం ఆవరణలో విత్తనాలు జల్లిన సర్పంచ్, ఎంపిటిసి

సేంద్రియ పంటకు శ్రీకారం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్ళపాలెంలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రం వద్ద శుక్రవారం సేంద్రియ పంటకు శ్రీకారం చుట్టారు. ఈ కేంద్రం వద్ద ఉన్న ఖాళీ స్థలంలో రసాయన ఎరువులు వాడకుండా కూరగాయల విత్తనాలు జల్లారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రెల్లి నాగయ్యమ్మ, ఎమ్‌పిటిసి లగిశెట్టి భవాని, పంచాయతీ కార్యదర్శి వెంకట లక్ష్మి, వైసిపి నాయకులు లగిశెట్టి గణేష్, వార్డు సభ్యులు కర్రి లోవరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-పంట నమోదుపై అభ్యంతరాలుంటే తెలియజేయాలి

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

ఈ పంట నమోదుపై అభ్యంతరాలుంటే తెలపాలని జిల్లా వ్యవసాయ అధికారి లీలావతి కోరారు. మండలంలోని చింతపాక సచివాలయంలో శుక్రవారం స్థానిక సర్పంచ్ గొలజాన శ్రీనివాస్ ఆధ్వర్యంలో చింతపాక ఆర్బీకేలో వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతు భరోసా, పీఎం కిసాన్ సాయం జమకాని రైతుల వివరాలను సేకరించాలని సిబ్బందిని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి వరితెగుళ్లపై రైతులకు నివారణ మార్గాలు తెలిపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో భాస్కరరావు పాల్గొన్నారు.

ఘనంగా జెడ్‌పిటిసి అనురాధ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- దేవరాపల్లి : కె.కోటపాడు జెడ్‌పిటిసి ఈర్లె అనురాధ జన్మదిన వేడుకలు శుక్రవారం మండలంలోని తారువ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. మాడుగుల నియోజకవర్గం నలుమూలల నుంచి వైసీపీ శ్రేణులు తారువ గ్రామానికి తరలివచ్చి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. దేవరాపల్లి జెడ్‌పిటిసి కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, కొత్తపెంట, వెంకటరాజపురం, తామరబ్బ సర్పంచులు రొంగలి వెంకటరావు, దాసరి సంతోష్, రామకృష్ణ తదితరులు ఆమెను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా సూర్యనారాయణ

ప్రజాశక్తి-కశింకోట : విశ్రాంత ఉద్యోగులు సంఘం మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా సిహెచ్ సోమేశ్వరరావు ఆధ్వర్యాన నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. సంఘం మండల గౌరవ అధ్యక్షునిగా వివి శాస్త్రి, అధ్యక్షునిగా పాము సూర్యనారాయణ, కార్యదర్శిగా కె.గోపాలరావు, కోశాధికారిగా బి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా జి.సూర్యనారాయణ, కె.సన్యాసయ్య, సంయుక్త కార్యదర్శిగా నిండా రమణ, కె.కామేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా మరో తొమ్మిది మంది ఎన్నికయ్యారు.

వాడ్రాపల్లిలో అంబలం పూజ

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో ఆ గ్రామ సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు ఆధ్వర్యాన గురువారం రాత్రి అంబలం పూజ కార్యక్రమం నిర్వహించారు. ఉత్తరాంధ్ర అర్చకుల సంఘం కన్వీనర్ వెలవలపల్లి కోటేశ్వరశర్మ అర్చకత్వంతో అయ్యప్పస్వామి మాలలు ధరించి వారు నియమనిష్టలతో పూజలు నిర్వహించారు. అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు భీశెట్టి వెంకట సత్యవతి దంపతులు ఇందులో పాల్గొని పూజలు చేశారు. సర్పంచ్ నూకరాజు ఎంపీ దంపతులను శాలువలతో సత్కరించారు. ఎలమంచిలి అనకాపల్లి, అచ్యుతాపురం, రాంబిల్లి, మండలాల నుండి పలువురు అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.


ఎంపీ సత్యవతి దంపతులను సత్కరిస్తున్న సర్పంచ్ నూకరాజు

ప్రతి నెలా వ్యవసాయ సలహా మండలి సమావేశం

జిల్లా వ్యవసాయ శాఖాధికారి లీలావతి

ప్రజాశక్తి- కె.కోటపాడు

రైతు భరోసా కేంద్రాలలో వ్యవసాయ సలహా మండలి సమావేశాలు ప్రతి నెలా మొదటి శుక్రవారం నిర్వహించాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి లీలావతి అన్నారు. మండలంలోని గుళ్లేపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదు చేసుకున్న రైతులు ఆ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించబడిన సోషల్ ఆడిట్ జాబితాను తనిఖీ చేసుకుని అభ్యంతరాలు ఉంటే వెంటనే తెలియచేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ గురించి వివరించారు. ప్రస్తుతం వరిలో సుడి దోమ ఉందని, దానిని సకాలంలో నివారించుకోవాలని సూచించారు. రెండో పంటకు వేరుశనగ విత్తనాలను సకాలంలో రైతులకు అందించేవిధంగా చర్యలు తీసుకుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బండారు దేముళ్ళు, మండల వ్యవసాయాధికారి సోమశేఖర్, ఎఇఓ లైలాదేవి, సలహా మండలి సభ్యులు, వాలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి లీలావతి

జిల్లాస్థాయి ఆటల పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-సబ్బవరం

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు సిహెచ్. చిన్నమ్మాయి తెలిపారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు మండల స్థాయి, నియోజకవర్గ స్థాయిలోనూ గెలుపొంది జిల్లా స్థాయికి ఎంపికైనట్లు వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులను ఎంఇఒ ఎస్.అప్పలరాజు, పిడి రెహమాన్, తోటి విద్యార్థులు అభినందించారు.


మాట్లాడుతున్న ఎంఇఒ అప్పలరాజు

'బూడి ఆధ్వర్యంలో నియోజకవర్గం అభివృద్ధి'

ప్రజాశక్తి- కె.కోటపాడు

ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలయుడు ఆధ్వర్యాన మాడుగుల నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ అన్నారు. మండల కేంద్రంలోని తన నివాసం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కె.కోటపాడు మండలంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని, ఇందులో భాగంగా లంకవానిపాలెం నుంచి జోగన్నపాలెం గ్రామం వరకు రూ.2.40 కోట్లతో తారు రోడ్డు వేయడానికి నిధులు మంజూరు చేయించారని చెప్పారు. త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. లంకవానిపాలెం సర్పంచి వి.దొరబాబు మాట్లాడుతూ ఈ రోడ్డు శిథిలమైందని, ప్రయాణించి అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తారురోడ్డుకు నిధులు మంజూరు చేయడం ద్వారా డిప్యూటీ సీఎం ముత్యాల నాయుడు లంకవానిపాలెం, పింద్రంగి, దాలివలస గ్రామాల ప్రజల గుండెల్లో పదిలమైన స్థానాన్ని సంపాదించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఈర్లే అనురాధ, వైసిపి నాయకులు దాట్ల శివాజీ రాజు, బండారు ముత్యాల నాయుడు మాస్టారు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఎంపిపి, జెడ్‌పిటిసి, వైసిపి నాయకులు

గొట్టివాడలో 'ఫ్యామిలీ ఫిజీషియన్'

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని గొట్టివాడ సచివాలయంలో శుక్రవారం స్థానిక వైద్యాధికారి ఎస్ఎన్ఆర్.చక్రవర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ సాలాపు మీనా ప్రారంభించారు. సుమారు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చక్రవర్తి మాట్లాడుతూ నెలకు ఒక రోజు ప్రతి సచివాలయంలో ఫ్యామిలీ ఫిజీషియన్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు సాలాపు వెంకటేశ్వరరావు, బగ్గు ఈశ్వరరావు, పంచాయితీ కార్యదర్శి మహేంద్ర రెడ్డి, ఎఎన్ఎం సుధారాణి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

కార్తీక ఏకాదశి పూజలు

ప్రజాశక్తి-అనకాపల్లి

కార్తీకమాసం శుద్ధ ఏకాదశిని పురస్కరించుకొని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో స్థానిక దేవునిగుమ్మం శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం మహిళలు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు, నక్షత్ర హారతి పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో రమాబాయి, అర్చకులు పులకండం గిరిబాబు, విజయ్ బాబు భక్తులు పాల్గొన్నారు. స్థానిక గౌరపాలెం గౌరీ పంచాయతన ఆలయంలో శివపార్వతులు, లక్ష్మీనారాయణకు వార్షిక కల్యాణోత్సవం నిర్వహించారు. వధువు తరుపున మళ్ల అప్పలనాయుడు ఇందిరా దంపతులు, వరుని తరపున ఆలయ అధ్యక్షులు బొడ్డేడ సన్యాసినాయుడు, కార్యదర్శి బుద్ధ రమణాజీ, కోశాధికారి శివ సూర్యనారాయణ, మాజీ అధ్యక్షులు కర్రీ సన్యాసినాయుడు బాలకృష్ణ దంపతులు కూర్చున్నారు. అంపోలు గోపాలకష్ణ శర్మ, పొందూరు సూర్యనారాయణ శాస్త్రి, తేజ గణేష్ ఆధ్వర్యంలో ఈ కల్యాణం నిర్వహించారు.

దేవరాపల్లి : మండలంలోని తిమిరాం ఉమామహేశ్వర నీలకంఠేశ్వరుడి ఆలయంలో ఏకాదశి పూజలు ఆలయ ప్రధాన అర్చకులు పాకల కామేశ్వరరావు భక్తులు నిర్వహించారు. శారదా నదిలో స్నానాలు ఆచరించి ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించారు. కార్తీకమాసం ఏకాదశి పూజలతో ఆయా గ్రామాలలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది.

విశాఖ డంపింగ్ యార్డుకు చెత్త తరలింపు

ప్రజాశక్తి-అనకాపల్లి

మండలంలోని మేజర్ పంచాయతీ తుమ్మపాల మెయిన్ రోడ్డులో ఉన్న గ్రామ కంఠం భూమిలో కొంత కాలంగా పేరుకుపోయిన చెత్తను సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం లారీల ద్వారా విశాఖ డంపింగ్ యార్డ్‌కు తరలించారు. ఇక్కడ చెత్త పేరుకుపోవడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతుండేది. చెత్త తరలింపుపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతాన్ని ప్రజా అవసరాలకు వినియోగిస్తామని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు మెంబర్లు సత్యారావు, ఎం నాగరాజు, వెలగా మోదు నాయుడు, పంచాయతీ ఈవో కె.శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు పీలా బుజ్జి పాల్గొన్నారు.


చెత్తను దగ్గరుండి ఎత్తిస్తున్న సర్పంచ్ పెంటయ్యనాయుడు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

దార్లపూడిలో 'ఫ్యామిలీ ఫిజీషియన్'

ప్రజాశక్తి-యస్.రాయవరం:మండలంలోని మేజర్ పంచాయతీ దార్లపూడిలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించినట్లు పెనుగొల్లు వైద్యాధికారి జి చైతన్య తెలిపారు. శుక్రవారం ఉదయం దార్లపూడి రామాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరంలో గర్భిణులకు, బాలింతలు, వృద్ధులకు వికలాంగులకు బిపి, షుగర్ తనిఖీలను నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఇంటి వద్ద నుంచి కదలలేని స్థితిలో ఉన్న రోగులను పరీక్షించినట్లు వైద్యాధికారి చైతన్య తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రజలంతా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ దేవరాజ్, ఏఎన్ఎమ్ కుమారి, సిహెచ్ఓ రేవతి, ఆశా వర్కర్లు, 104 సిబ్బంది పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి

బోరు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని చీడిగుమ్మలలో కాళీమాత ఆలయం వద్ద ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ నిధులతో బోర్‌వెల్ నిర్మాణ పనులను శుక్రవారం జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి అప్పలనాయుడు, ఉప సర్పంచ్ కసిరెడ్డి సత్యనారాయణ, కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు రామకృష్ణ, వార్డు మెంబర్లు కొండబాబు, అప్పలనాయుడు, శ్రీకాళీమాత కమిటీ సభ్యులు ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో ఏఎల్‌పురంలో గ్రామ సర్పంచ్ లోచల సుజాత గత నాలుగు రోజుల నుండి గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. డ్రైనేజ్ పూడికతీత, కొంగసింగి రోడ్డు మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తా చెదారాన్ని ట్రాక్టర్లతో తరలించారు. స్టేట్ బ్యాంకు వరకు డ్రైనేజ్ పూడికతీత చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కాలువల్లో చెత్తా చెదారం వేయ కూడదన్నారు. పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని కోరారు.



పనులు చేయిస్తున్న సర్పంచ్

ఎన్ఎఓబి నిర్వాసితుల పోరాటానికి మద్దతు

ప్రజాశక్తి -నక్కపల్లి:ఎన్ఏఓబి నిర్వాసిత మత్స్యకారులు చేస్తున్న పోరాటానికి తమ సంపూర్ణమైన మద్దతు ఉంటుందని హెటిరో పైప్ లైన్ వ్యతిరేక పోరాట కమిటీ మత్స్యకార నాయకులు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అప్పలరాజు ప్రకటించారు. హెటిరో పైపులైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకార జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన శాంతియుత మహా ధర్నా శుక్రవారం నాటికి 340వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అప్పలరాజు, మత్స్యకార నాయకులు, రాంబిల్లి, ఎస్.రాయవరం మండలాల్లో ఎన్ఏఓబి నిర్వాశిత మత్స్యకారులు చేస్తున్న పోరాటానికి మద్దతు ప్రకటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి నిర్వాసితుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేసిన మహా సంకల్ప పాదయాత్ర సందర్భంగా ఎలమంచిలిలో జరిగిన బహిరంగసభలో అధికారంలోకి వచ్చిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వమే నిర్వాసితులకు ప్యాకేజీ చెల్లిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. నేటికీ ప్యాకేజీ ఎందుకు చెల్లించలేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే ప్యాకేజీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 11,12 తేదీలలో విశాఖపట్నం వస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దృష్టికి ప్యాకేజీ, ఇతర సమస్యలపై తెలియజేయాలని కోరారు. ఎన్ఏఓబి ప్రాజెక్టు కేంద్ర ప్రభుత్వం పరిధిలోదని రాష్ట్ర ప్రభుత్వం తప్పించు కోవాలని చూస్తుందన్నారు. అభివృద్ధి పేరు చెప్పి సముద్ర తీరంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి ప్రభుత్వాలు మత్స్యకారుల ఉపాధిని దెబ్బ తీస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి వాసుపల్లి నూకరాజు, గోసల స్వామి, మైలపల్లి జాన్, చేపల సోమేష్, మైలపల్లి బాపూజీ, పిక్కి రాజు, బొంది నూకరాజు, చొక్కా గోపి తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న అప్పలరాజు, మత్స్యకారులు

ఎమ్మెల్సీ ఓట్లు నమోదు

ప్రజాశక్తి- కోటవురట్ల:పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓట్ల నమోదు చేసుకోవాలని తహసిల్దారు సోమశేఖర్ తెలిపారు. మండల వ్యాప్తంగా శుక్రవారం నాటికి 634 ఓట్లు నమోదు అయ్యాయని తెలిపారు. నమోదు కావలసిన దరఖాస్తులు 350 వరకు ఉన్నట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా దాదాపు 1500 వరకు ఓట్లు నమోదు అయ్యే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి- చీడికాడ:ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటు నమోదు చేయించుకోవాలని జడ్పిటిసి లాలం శారద వరలక్ష్మి జానకిరామ్, ఎంపీపీ కురచా జానకిరామ్ నారాయణమూర్తి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటు నమోదుపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైసిపి గ్రామ పార్టీ అధ్యక్షులు పరవాడ మహేష్, పాల సంఘం అధ్యక్షులు పరవాడ అప్పారావు, కార్యకర్తలు బొడ్డు అప్పలనాయుడు, శిరీ షోళ్ళ మహేష్, నూనెల పైడితల్లి పరవాడ అప్పలనాయుడు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి-నాతవరం:మండలంలోని గన్నవరం సచివాలయాన్ని ఎంపీడీవో యల్.యాదిగేశ్వరరావు శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు. వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది గ్రామస్తులకు అందుబాటులో ఉండాలని సూచించారు. గ్రామస్తుల నుంచి వచ్చే వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చెప్పారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. విధులు పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. జగనన్న కాలనీలు త్వరగాపూర్తి అయ్యే విధంగా చూడాలన్నారు. ఇల్లు నిర్మిస్తున్న లబ్ధిదారులకు బిల్లులు మంజూరులో ఆలసత్వం కాకుండా చూడాలని చెప్పారు. అనంతరం ఆర్బికే కేంద్రాన్ని పరిశీలించారు.



మాట్లాడుతున్న ఎంపిడిఓ

పశువులకు టీకాలు

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో గుడివాడ పంచాయతీ మొట్టవానిపాలెం గ్రామంలో సర్పంచ్ గుమ్మాల శంకర్రావు ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. లంపీ స్కిన్ వ్యాధి నివారణకు పశువైద్యులు కే.జగన్మోహన్ పశువులకు టీకాలు వేశారు. ఈ వ్యాధిపై రైతులు అప్రమత్తంగా ఉండాలని, వైద్యుల సేవలను ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. పశువుల నోట్లో బొబ్బలు రావడం, తిండి తినక పోవడం, తీవ్రంగా జ్వరం వంటివి వ్యాధి లక్షణాలు అని తెలిపారు. సర్పంచ్ శంకర్రావు మాట్లాడుతూ, గుడివాడ పంచాయతీ మట్టవానిపాలెం, పిల్లవానిపాలెం గ్రామాలలో పశువులు వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నందున పశు వైద్యాధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.



టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది



సరుకులు ఇస్తున్న నాసా ప్రతినిధులు

బాధితులకు 'నాసా' సహాయం

ప్రజాశక్తి-నాతవరం:మండలంలోని ఎంపీపట్నం గ్రామంలో అగ్ని ప్రమాద బాధితులకు నాసా స్వచ్ఛంద సంస్థ చేయూత అందించింది. శుక్రవారం అగ్ని ప్రమాదంలో నష్టపోయిన కోరిబిల్లి లలిత కుటుంబ సభ్యులకు నాసా సంస్థ ప్రతినిధులు తక్షణ సహాయంగా నిత్యావసర సరుకులను అందజేశారు. భవిష్యత్తులో ఇల్లు నిర్మించుకోవడానికి కూడా సహాయం చేస్తామని సంస్థ ప్రతినిధులు జ్యోతి ప్రేమదాసు, సుజిత్ కాంత్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాసా సంస్థ సామాజిక కార్యకర్తలు శ్రీను, శ్రీనివాస్, దళిత నాయకులు కొండ్రు అప్పారావు, మహాలక్ష్మి, లావరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్

అన్నవరంలో గ్రామసభ

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో అన్నవరం గ్రామంలో సర్పంచ్ అయ్యప్పరెడ్డి సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ప్రధాన సమస్యలు గ్రామసభ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించు కోవాలన్నారు. ఏపీవో గంగు నాయుడు మాట్లాడుతూ, గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా పనులు గుర్తించి ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరంకు సంబంధించి పనుల గుర్తింపునకు గ్రామసభ నిర్వహిస్తున్నట్లు ఏపీవో తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సతీష్, వైసిపి సీనియర్ నాయకులు ఎర్రం నాయుడు పాల్గొన్నారు.



పిచ్చి మొక్కలు తొలగిస్తున్న విద్యార్థులు

కళాశాల మైదానంలో శ్రమదానం

ప్రజాశక్తి -నక్కపల్లి :స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ప్రిన్సిపల్ శైలజ ఆధ్వర్యంలో విద్యార్థులు శ్రమదానం చేపట్టారు. మైదానంలో ఉన్న పిచ్చి మొక్కలు, గడ్డి తొలగించి పరిశుభ్రంగా చేశారు. విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ అప్పారావు, వాలంటీర్లు పాల్గొన్నారు .

మనోహర్ దృష్టికి హెటిరో పైపులైన్ సమస్య

ప్రజాశక్తి -నక్కపల్లి

హెటిరో పైప్‌లైన్ సమస్యను జనసేన పార్టీ పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకు వెళ్లినట్లు రాజయ్యపేట జనసేన పార్టీ యువ నాయకులు, మత్స్యకార జేఏసీ రూరల్ జిల్లా అధ్యక్షులు పిక్కి స్వామి తెలిపారు. హెటిరో వ్యర్థ జలాలు సముద్రంలోకి వదలడంత సంపద నశించి పోవడంతో మత్స్యకారులంతా ఉపాధి కోల్పోయి రోడ్డును పడుతున్నారని తెలిపారు.కంపెనీ వ్యర్థ రసాయన జలాలను సముద్రంలోకి వదలడానికి కొత్తగా పైప్ లైన్ ఏర్పాటు చేస్తున్నారని, పైప్ లైన్ కు వ్యతిరేకంగా మత్స్యకారులు 340 రోజుల నుంచి ధర్నా చేపడుతున్నా సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గంలో చేపట్టనున్న రథయాత్రలో భాగంగా ఆందోళన శిబిరం వద్దకు పవన్ కళ్యాణ్ తీసుకుని వస్తామని మనోహర్ హామీ ఇచ్చినట్లు స్వామి తెలిపారు.

పిఎం పర్యటనను జయప్రదం చేయాలి

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మశ్రీ

ప్రజాశక్తి-రావికమతం:ఈనెల 12న విశాఖలో జరిగే పలు ప్రారంభోత్సవ కార్యక్రమాలకు విస్తున్న ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, ఏపీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిల పర్యటనను జయప్రదం చేయాలని అనకాపల్లి జిల్లా వైసిపి అధ్యక్షులు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలతో శుక్రవారం మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆంధ్ర విశ్వవిద్యాలయం మైదానంలో జరిగే భారీ బహిరంగ సభకు పార్టీ శ్రేణులంతా పెద్ద ఎత్తున తరలి రావాలని ఆయన సూచించారు. జన సమీకరణకు ఇప్పటి నుంచే క్షేత్ర స్థాయిలో ముమ్మర చర్యలు చేపట్టాలని నాయకులకు సూచించారు. సబ్బవరం నుంచి కోటనందూరు వరకు ఫోర్ లైన్స్ రోడ్డును మంజూరు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ ఘట్కరిని కోరగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఎంపీపీ శ్రీ పైలరాజు, వైసిపి నాయకులు జగ్గారావు, డిసిఎంఎస్ డైరెక్టర్ సత్యదేవ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు వెంకటరమణ, భవాని ప్రసాద్, బాపునాయుడు, గంటా ఈశ్వర్‌రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రాజన నరసింహులు పాల్గొన్నారు .



మాట్లాడుతున్న ధర్మశ్రీ



ఆందోళన చేపడుతున్న గ్రామస్తులు

వాకపాడు గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:నేవల్ బేస్ నిర్మాణంతో తమకు ఇస్తామన్న ప్యాకేజీ సమస్యపై తక్షణం స్పందించాలని వాకపాడు గ్రామస్థులు ఆందోళన బాట పట్టారు. శుక్రవారం ఉదయం మండలంలోని వాకపాడు గ్రామంలో సర్పంచ్ మైలపల్లి శ్రీను నేతృత్వంలో ఆందోళన చేశారు. నేవల్ బేస్ నిర్మాణంతో వాకపాడు, బంగారమ్మపాలెం తదితర గ్రామాలలోని ప్రజలు ఉపాధి కోల్పోయారని గ్రామస్తులు తెలిపారు. నిర్మాణానికి ముందు తమకు ఇచ్చిన హామీలు అమలు చేయక పోవడం సరికాదని, దీనిపై నేవల్ బేస్ అధికారులు, జిల్లా యంత్రాంగం స్పందించాలన్నారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగుతుందని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో వాకపాడు, బంగారమ్మపాలెం తదితర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



పింఛను ఇస్తున్న సర్పంచ్, సచివాలయం సిబ్బంది

జైతవరంలో పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-చీడికాడ:మండలంలోని జైతవరం గ్రామంలో నూతనంగా మంజూరైన పింఛన్లను గ్రామ సర్పంచ్ కోడూరు సత్యవతి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్క పేదవారికి కూడా పింఛన్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఈర్లి చైతన్య, మాజీ సర్పంచ్ కోడూరు నారాయణమూర్తి, పాల సంఘం అధ్యక్షులు రెడీ బలరాం, పంచాయతీ కార్యదర్శి గోపి, స్కూల్ కమిటీ చైర్మన్ లాలం నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఫ్రిజ్ పత్రాలు ఇస్తున్న క్లబ్ ప్రతినిధులు

ఆసుపత్రికి రిఫ్రిజిరేటర్లు వితరణ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్థానిక ఏరియా ఆసుపత్రిలో మందులు ఉంచేందుకు గాను రిఫ్రిజిరేటర్లు లైన్స్ క్లబ్ సభ్యులు అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ చెప్పడంతో అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ లైన్స్ క్లబ్ ప్రతినిధులు నర్సీపట్నం ఏరియా హాస్పిటల్‌లో మందులు స్టోర్ చేయడానికి రెండు రిఫ్రిజిరేటర్లు అందజేసారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ గవర్నర్ ఇందిర మాట్లాడుతూ, మందులు నిల్వ ఉంచేందుకుగాను అవసరం ఉందని ఎమ్మెల్యే గణేష్ తెలియజేశారన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి మాట్లాడుతూ, ఆస్పత్రిలో రిఫ్రిజిరేటర్లు అవసరం ఉందని చెప్పిన ఎమ్మెల్యే గణేష్ మాటకు గౌరవించి సమస్యను దృష్టిలో పెట్టుకొని రిఫ్రిజిరేటర్లు అందించడం ఆనందదాయకం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు విజయశాంతి, నేలవేణి, ప్రముఖ వ్యాపారవేత్త వెలగ నారాయణరావు, వికాస్ సతీష్ పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతో కార్మిక హక్కుల సాధన

▶▶ సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ▶▶ 600 మంది సంఘంలో చేరిక



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జగ్గునాయుడు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కార్మికులు ఐక్యమై తమ పక్షాన నిజాయితీగా కృషి చేసే సంఘంలో చేరి పోరాడితేనే హక్కులు సాధించుకోగలరని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. విశాఖపట్నం పోర్ట్‌లోని సైడింగ్స్ 600 మంది కార్మికులు ఇతర యూనియన్ల నుంచి సిఐటియులో చేరారు. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం పోర్టు రైల్వే సైడింగ్స్ కాన్వెంట్ జంక్షన్ నుంచి షీలా నగర్ వరకు విస్తరించి ఉందని, వీటిలో 1800 మంది కార్మికులు పోర్టుకు సంబంధించిన ఎగుమతులు, దిగుమతులు, లోడింగ్, అన్ లోడింగ్ పనులు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే వీరిలో 1200 మంది సిఐటియులో ఉన్నారని తెలిపారు. మిగిలిన 600 మంది ఇతర యూనియన్లలో ఉండే వారిని, వారంతా ఇప్పుడు సిఐటియులో చేరారని చెప్పారు. ఈ సందర్భంగా కార్మిక సభను ఏర్పాటు చేయడం హర్షించదగిన విషయమన్నారు. సంఘటిత పోరు ద్వారానే కార్మికులు తమ హక్కులను సాధించుకోగలరన్నారు. సిఐటియులో చేరిన కార్మికులందరికీ అభినందనలు తెలిపారు. 1991కి ముందు కార్మికులకు రేయింబవళ్లు ఉపాధి ఉండేదన్నారు. తరువాత క్రమంలో కేంద్రంలోని ప్రభుత్వాలు పోర్టు బెర్త్‌లను అమ్మడం, ప్రైవేటీకరణ చేయడం, ప్రైవేట్ పోర్టులు ప్రవేశంతో ఉపాధి బాగా క్షీణించిందని ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖపట్నం పోర్టును బలోపేతం చేయడం ద్వారా కార్మికుల ఉపాధిని పెంచే చర్యలను కేంద్ర ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు. పోర్టులో ఎగుమతి, దిగుమతి పనులు చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న సైడింగ్స్ కార్మికుల జీతభత్యాలు అంతంత మాత్రమే ఉన్నాయన్నారు. కొన్ని ప్రైవేటు యాజమాన్యాలు సకాలంలో కార్మికులకు వేతన ఒప్పందాలు చేయకుండా నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచుతూ ఒప్పందాలను సకాలంలో చేయాలని డిమాండ్ చేశారు. సైడింగ్స్ కార్మికులకు సిఐటియు అండగా ఉంటుందని భరోసానిచ్చారు. యూనియన్ అధ్యక్షులు పి.పైడిరాజు మాట్లాడుతూ ఇఎస్ఐ, పిఎఫ్, ప్రభుత్వ సెలవులు వంటి కనీస కార్మిక హక్కులు అమలుకు నోచుకోవటం లేదన్నారు.



సిఐటియులో భారీ సంఖ్యలో చేరిన కార్మికులు

కార్మికులకు మంచినీరు, లైటింగ్, భోజన, విశ్రాంతి గదులు, కనీస సదుపాయాలను యాజమాన్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

నూతన కమిటీ ఎన్నిక

అనంతరం విశాఖ పోర్టు రైల్వే ఆల్ సైడింగ్స్ మేస్త్రీలు, వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షులుగా ఎం.జగ్గునాయుడు, అధ్యక్షులుగా పి.పైడిరాజు, కార్యదర్శిగా సిహెచ్.రాంబాబు, ఆఫీస్ బేరర్లుగా జి.అప్పలనాయుడు, పి.ప్రసాద్, బి.సింహాచలం, డి.సత్యనారాయణ, జి.బలరాం, జి.దేముడు నాయుడు, కె.సన్యాసిరావు ఎన్నికయ్యారు. నూతన కమిటీని ఉద్దేశించి సిఐటియు మల్కాపురం జోన్ అధ్యక్షులు కె.పెంటారావు మాట్లాడారు. కార్యక్రమంలో సైడింగ్స్‌కు సంబంధించిన మేస్త్రీలు, గ్యాంగు సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఒడిశాలో భర్త మృతిపై ఫిర్యాదు

ప్రజాశక్తి-కొత్తకోట: ఒడిశా రాష్ట్రంలో కూలి పనుల నిమిత్తం వలసవెళ్లిన వ్యక్తి మృతి చెందిన సంఘటన రావికమతం మండలం జడ్.కొత్తపట్నం గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. మృతిని భార్య గాలి రాము విలేకర్లకు వివరాలు తెలిపింది. తన భర్త గాలి రాజబాబు (52) గత కొన్ని రోజుల కిందట ఒడిస్సా రాష్ట్రంలో కలప సేకరణ నిమిత్తం మరో కొంతమంది కూలీలతో పనుల నిమిత్తం వలస వెళ్లాడని తెలిపింది. గురువారం సాయంత్రం సహచర కూలీలతో కలప సేకరణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు ఆ కర్రలు తన భర్త రాజబాబుపై పడి తీవ్రంగా గాయపడ్డాడని సహచర కూలీలు సమాచారం ఇచ్చారని ఆమె తెలిపింది. గురువారం రాత్రి ఫోన్ చేసిన వ్యక్తులు రాజబాబుకు చిన్న చిన్న గాయాలు తగిలినట్టు చెప్పారని, శుక్రవారం ఉదయం ఫోన్ చేసి మృతి చెందాడని అంబులెన్సులో గ్రామానికి తీసుకు వస్తున్నట్టు తెలిపారని చెప్పింది. పొంతన లేని విధంగా సమాచారం ఇవ్వడంతో తన భర్త మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని ఆమె పేర్కొంది.సంఘటన జరిగినప్పటి నుంచి కూలీలను పనుల కోసం తీసుకు వెళ్లిన మాకవరపాలెం మండలం తూటిపాల గ్రామానికి చెందిన కొల్లి అప్పలనాయుడు కాంట్రాక్టర్ ఫోన్ స్విచ్ అఫ్ చేశాడనని తెలిపింది. తన భర్తను ఏదో చేసి ఉంటారని మృతిని భార్య రాము రోధించింది. ఈ సంఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలని కోరుతూ కొత్తకోట పోలీస్‌లకు ఫిర్యాదు చేసినట్టు ఆమె చెప్పింది.ఈ సంఘటన పై కేసు నమోదు చేసిన పోలీసులు రాజబాబు మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి పోస్టు మార్టం నిమిత్తం తరలించారు.

అయ్యన్న ఇంట సందడి

పలువురు నాయకుల పరామర్శ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడును గురువారం తెల్లవారు జామున సిఐడి పోలీసులు అరెస్టు చేసినప్పటి నుండి ఆయన ఇంటి వద్ద అభిమానులు, కార్యకర్తలు, నాయకులు కొలహాలంగా మారింది. అయ్యన్న రిమాండ్‌ను కోర్టు తిరస్కరించడంతో ఆయన ఇంటికి చేరుకున్నారు. దీంతో శుక్రవారం పలురువు సంబరాలు చేసుకున్నారు. నాయకులు వస్తూ అయ్యన్నను పరామర్శిస్తూ సెల్ఫీలు దిగుతున్నారు.

అయ్యన్నకు పప్పల పరామర్శ

నర్సీపట్నం రూరల్:మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, రాజేష్‌లను మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు పరామర్శించారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ, ప్రహరీ గోడ నిర్మాణానికి, సిఐడి అధికారులకు ఏమి సంబంధం అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిని మెప్పించేందుకు సిఐడి పని చేస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రశ్నించినందుకు అయ్యన్న కుటుంబాన్ని ఇబ్బందులు గురి చేస్తుందని, ఇది సరి కాదన్నారు.

కార్యకర్తలకు రుణపడి ఉంటా :అయ్యన్న

నర్సీపట్నం రూరల్: తాను ఇప్పటి వరకు తెలిసి తప్పు చేయలేదని, భవిష్యత్తులో చేయనని, తన కుటుంబానికి అండగా నిలిచిన కార్యకర్తలకు జీవితాంతం రుణపడి ఉంటానని మాజీమంత్రి, తెలుగుదేశం పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. బెయిల్ మంజూరు కావడంతో నర్సీపట్న వచ్చిన అయ్యన్నపాత్రుడుకు



అయ్యన్నతో మాట్లాడుతున్న చలపతిరావు

టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. మేళతాళాలతో స్వాగతం పలికి పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఇంటికి చేరుకున్న అయ్యన్న కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. తనను ఏమి చేయలేరని, ఈ కారణంతోనే అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. పరిపాలన చేతకాక, ప్రజలను మభ్యపెట్టేందుకు తమపై కేసులు పెట్టి ఎన్నాళ్లు కాలం గడుపుతారని ప్రశ్నించారు. తనపై 14 కేసులు పెట్టి ఏమి చేశారన్నారు. అధికార పక్షం తప్పు చేస్తే విమర్శించడం ప్రతిపక్షంగా తమ ధర్మమని, వీలైతే చేసిన తప్పులను సరి చేసుకోవాలన్నారు.

గొలుగొండ: మండలంలోని ఏఎల్‌పురం చుట్టుపక్కల గ్రామాల టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో బైక్ ర్యాలీగా నర్సీపట్నంలోని మాజీ మంత్రి అయ్యన్న ఇంటికి చేరుకున్నారు. అనంతరం వారంతా కలిసి తమ అయ్యన్నతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి చిటికెల తారకవేణుగోపాల్ మాట్లాడుతూ, ప్రభుత్వ వ్యతిరేక

ఆర్యవైశ్య వన సమారాధన

ప్రజాశక్తి-పాయకరావుపేట: పాయకరావుపేట వాసవి క్లబ్, వాసవి వనతా క్లబ్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య వన సమారాధన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం కమిటీ చైర్మన్ దాసరి నూకయ్య శెట్టి రుద్రాభిషేకం నిర్వహించారు. పిల్లలు, పెద్దలు ఆట పాటలతో ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపారు. పాయకరావుపేట, తుని గ్రామాల నుంచి సుమారు 3000 మంది ఆర్యవైశ్యులు పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు.



వడ్డిస్తున్న నిర్వాహకులు

350 లీటర్ల సారా పులుపు ధ్వంసం

ప్రజాశక్తి-చీడికాడ:మండలంలోనొ తురువోలు పంచాయతీ తంగుడిబెల్లి గ్రామంలో సచివాలయం మహిళ పోలీస్ గొటివాడ సుజాత గ్రామ వాలంటీర్ల సహాయంతో గ్రామంలో ఆకస్మిక దాడులు చేశారు. తంగుడిబెల్లి గ్రామంలో నాటు సారు తయారీకి సిద్ధంగా ఉంచిన 350 లీటర్ల నాటు సారా పలుపును గుర్తించి ధ్వంసం చేశారు. మహిళా పోలీస్ మాట్లాడుతూ, నాటు సారా పులుపు తయారీదారుల ఆచూకీ దొరకలేదని తెలిపారు.



స్వాధీనం చేసుకున్న పులుపు